క్లుప్తంగా

యువత రక్తదానం

పుంగనూరు: పట్టణంలోని రోటరీక్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మంగళవారం సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు యువతీ యువకులు రక్తదానం చేశారు. వారిని రోటరీ క్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ అభినందించారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ ప్రభాకర్, పూల త్యాగరాజు, రవికుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.55 వేలు

పుంగనూరు: పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వర స్వామి స్వామి ఆలయానికి హుండీ ఆదాయం రూ.55 వేలు లభించింది. మంగళవారం గ్రూపు టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఆదాయాన్ని దేవదాయశాఖ ఖాతాలో జమ చేసినట్లు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా శ్రీసీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన



శ్రీసీతారామలక్ష్మణ విగ్రహాలను ఊరేగిస్తున్న రఘుపతిగౌడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని గొనితిమ్మేపల్లె శ్రీరామభజన మందిరంలో మంగళవారం శ్రీసీతా రామలక్ష్మణ ఆంజనేయస్వామి నూతన పంచ లోహ విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, తారక హోమం, గణపతి, వాస్తు నవ గ్రహ పరిహార శాంతి హోమాలు నిర్వహించారు. రఘుపతి గౌడు కుటుంబ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్చకులు రామక్రిష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ టీయం గొల్లపల్లెకు చెందిన లక్ష్మీదేవమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద వైద్యానికి ఆర్థిక సాయం అందింది. ఆమె గతంలో ఆమె చేసిన వినతిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమెకు రూ.26 వేలు మంజూరు చేయించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆమెకు ఎంపీపీ ఈశ్వరయ్య చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్లలో...



పులిచెర్లలో చెక్‌ను అందజేస్తున్న నాయకులు

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీపీ సురేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. వగ్లవారిపల్లెకు చెందిన లక్ష్మీదేవికి రూ.65 వేలు, తురకపేటకు చెందిన ఖాదర్‌బాషాకు రూ.55 వేల చెక్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగరాజప్రసాద్, గోవిందరెడ్డి, దామోదరరెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న దాతలు

వి.కోట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నరేంద్ర, అమరనాథ్ కోరారు. మంగళవారం మండలంలోని ఎస్.బండపల్లె పంచాయతీ బెల్లకుంట గ్రామంలో వివిధ రకాల పండ్లు,పూల మొక్కలను రైతులు, ప్రజలకు పంపిణీ చేసి వారు మాట్లాడారు.

స్కూలు పిల్లలకు బస్సు, ఆటో సౌకర్యం



శ్రీనివాసుపురంలో సంక్షేమ బావుటా బుక్‌లెట్లను ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్



విద్యార్థులతో ఎమ్మెల్సీ భరత్, పార్టీ నాయకులు

- ప్రత్యేక నిధులతో గ్రామాలలో మురుగు కాలువల నిర్మాణం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్ హామీ

గుడుపల్లె : స్కూలు పిల్లలకు బస్సు, ఆటోల సౌకర్యం కల్పిస్తామని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ భరత్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన మండలంలోని ఓయస్ కొత్తూరు గ్రామ పంచాయతీలోని శ్రీనివాసపురం, క్రిష్ణరాజపురం, కొండసముద్రం, చిన్నకొటమాకనపల్లె, చిన్న అగ్రహారం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. తమకు పథకాల ఫలాలు సక్రమంగా అందుతున్నాయని గ్రామస్తులు ఆయనకు చెప్పారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి

అధికారంలోకి వచ్చిన దాదాపు నాలుగున్నరేళ్ల కాలంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహరెడ్డి సంక్షేమం, అభివృద్ధి పరంగా రాష్ట్రాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్లారన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా పథకాలను అర్హులకు చేరుస్తోందన్నారు. అంతేకాకుండా ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాయకులు జేబులు నింపుకోవడం తప్పితే ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలు టీడీపీ పాలన, వైఎస్సార్ సీపీ పాలనను బేరీజు వేసుకుని మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ దేవప్పనాయుడు, పార్టీ మండల కన్వీనర్ రామక్రిష్ణ, రామమూర్తి, నాయకులు తిమ్మరాయుడు, శివప్ప, దేవరాజు, క్రిష్ణప్ప, మల్లమ్మ, సుజాత, ఎంపీడీఓ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి సమస్యలు

కొండసముద్రం గ్రామం నుంచి కొటమాకనపల్లెలోని పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామస్తులు ఆయన దృష్టికి తేవడంతో పైవిధంగా ఎమ్మెల్సీ స్పందించారు. అలాగే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రత్యేక నిధులతో అన్ని గ్రామాలకు మురుగునీటి కాలువలు నిర్మిస్తామని, సీసీ రోడ్లు వేయిస్తామన్నారు. క్రిష్ణరాజపురం, కొండసముద్రం గ్రామాలలో గంగమ్మ ఆలయాల నిర్మాణానికి రూ.లక్ష చొప్పున ఇస్తానని ప్రకటించారు.

డివిజన్‌కు 868 టన్నుల ఎరువులు

- ఆర్బీకేలలో పంపిణీ
- వ్యవసాయశాఖ ఏడీ శివకుమార్



శివకుమార్

పుంగనూరు: పుంగనూరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలలో ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొత్తం 118 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించేందుకు సిద్ధం చేశామన్నారు. అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డుల ద్వారా ఎరువులు పొందవచ్చన్నారు. యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. చౌడేపల్లె, గంగవరం, పుంగనూరు, పెద్దపంజాణి, పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం, సోమల మండలాల్లో రైతులకు మొత్తం 868 టన్నుల ఎరువులను పంపిణీకి సిద్ధం చేసి ఉంచామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

- మండల సమావేశంలో అధికారులతో ఎమ్మెల్సీ భరత్



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మాట్లాడారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను సకాలంలో అప్‌లోడ్ చేసి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేలా చూడాల్సిన బాధ్యత హౌసింగ్ అధికారులపై ఉందన్నారు. అలాగే కొత్తగా ఎవరైనా ఇళ్లు కట్టుకునేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో నకిలీ ఇంటి నివేశ పత్రాలు ఎక్కువయ్యాయని, వాటిని రద్దు చేయాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా విజలాపురం, బళ్ల, రాజుపేట, రామకుప్పంలో నకిలీ ఇంటి పట్టాలు ఎక్కువగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో విచారణ చేసి, నకిలీ పట్టాల రద్దుకు ఆర్డీఓకు నివేదిక పంపుతామని తహసీల్దార్ మురళి ప్రకటించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, ఎంపీడీఓ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సోమల: నాడు-నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారి, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీకి చెందిన అడుసుపల్లె, జయంతి కాలనీ ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను వైస్ ఎంపీపీ ప్రభాకరతో కలిసి ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

కుప్పం డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ-గ్రేడ్

కుప్పం: కుప్పం డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ-గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ బీసీ నాగరాజ్ తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో మెరుగైన విద్యను అందిస్తుండటంతో బీ- గ్రేడ్ ప్రకటించారని పేర్కొన్నారు. రెండు రోజులు పాటు కళాశాల ప్రాంగణంలో న్యాక్ బృందం పర్యటించి విద్యార్థుల తరగతి గదులు, లైబ్రరీ, క్రీడా మైదానం , మౌలిక వసతులను పరిశీలించిందని చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చౌడేపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీ వాసులు

- వలంటీర్ చొరవతో గ్రామస్తుల చేయూత

బైరెడ్డిపల్లె: 30 ఏళ్ల క్రితం తమిళనాడు నుంచి వలస వచ్చి బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో స్థిర పడ్డ పేద కుటుంబానికి కాలనీ వాసులు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. తమిళనాడుకు చెందిన కాశీ సింగదేవర్ భార్యా పిల్లలతో ఇక్కడికొచ్చి జీవిస్తున్నాడు. బైరెడ్డిపల్లెలో మురుకులు, పచ్చిళ్లు చేసి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కరోనా సమయంలో వ్యాపారం సన్నగిల్లడంతో పాటు ఆరోగ్యం క్షీణించింది. విధి లేక జీవనం కోసం భార్యతో పాటు పిల్లలు కూలి పనులకు వెళ్లాల్సి వచ్చింది. కాశీ సింగదేవర్‌ను వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న వలంటీర్ అనిల్ ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడారు. కాలనీలో ఉంటున్న కాశీ సింగదేవర్‌కు తమ వంతు సహాయం చేయాలని కోరాడు. గ్రామస్తుల నుంచి రూ.15 వేలు సేకరించి ఆర్థిక సాయం అందజేశాడు. వలంటీర్ సేవలను గ్రామస్తులు అభినందించారు.

పరుగులు తీస్తున్న అభివృద్ధి, సంక్షేమం



లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- రెండేళ్లలో పట్టణంలో రూ.120 కోట్లు ఇచ్చాం
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: గతంలో ఏం జరిగిందో మనకు అనవసరం.. ప్రస్తుతం జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాలిటీ కొత్తపేట 20,21 సచివాలయాల పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. వివిధ పథకాల రూపేణా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. తొలుత స్థానిక మదనపల్లె రోడ్డులోని మారెమ్మ ఆలయంలో పూజలు చేశారు. కొత్తపేట మసీదులో మతపెద్దలను కలిసి వారి సమస్యలను ఆలకించారు. కొత్తపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం వార్డుల్లోని రఘువీరారెడ్డి కాలనీ, మదనపల్లె రోడ్డు, గుండుబావి, దండపల్లె రోడ్డు, లింగాయత్ వీధిలో పర్యటించారు. మొత్తం మీద 1238 కుటుంబాలను ఆయన కలిశారు.

ప్రతి వర్గానికీ మేలు

ఆయన మాట్లాడుతూ ఆసరా, అమ్మ ఒడి, చేదోడు, క్రాప్ ఇన్సూరెన్స్, ఈబీసీ నేస్తం, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, జగనన్న విద్యాదీవెన, కాపు నేస్తం, సామాజిక పింఛన్లు, రైతు భరోసా, సున్నా వడ్డీ, వాహనమిత్ర, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ బీమా, చేయూత, జగనన్న లేఔట్లు, సొంత ఇంటి స్థలాలకు ఇళ్లు మంజూరు..మొదలైన వాటికి సంబంధించి పట్టణంలోని 1,848మంది బీసీలు, 174మంది ఎస్సీలు, 11మంది ఎస్టీలు, 564మంది మైనారిటీలు, 82మంది కాపులు, 423 మంది ఇతరులకు రూ,78.94కోట్లను డీబీటీ ద్వారా పంపిణీ చేశామన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి 4,294మందికి రూ.41.72 కోట్లను ఇచ్చామన్నారు. ఇలా ప్రభుత్వ పథకాల రూపేణా రూ.120 కోట్లను మున్సిపాలిటీలో ఇచ్చామని, 98 శాతం మందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా పార్టీలకతీతంగా పథకాల ఫలాలను ప్రజల దరికి చేర్చిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, రాష్ట్ర కార్యదర్శి మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చాన్బా కమాల్, కిరణ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, గంగవరం కన్వీనర్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పార్వతి, సచివాలయాల కన్వీనర్ కోదండరామయ్య, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం



విరాళమిస్తున్న కిరణ్‌కుమార్ ఫౌండేషన్ సభ్యులు

వి.కోట: మండలంలోని కొంగాటం పంచాయతీ ఎగువ గంధారమాకులపల్లెలో నాగ దేవత విగ్రహాల ప్రతిష్ఠాపనకు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కోట్ల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం తమ కిరణ్ ఫౌండేషన్ పేరిట రూ.10 వేలను విరాళంగా గ్రామ పెద్దలకు అందజేశారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు కెనరా బ్యాంక్ నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్

వి.కోట: మండలంలోని పట్రపల్లె ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు మంగళవారం అందజేశారు. 5 నుంచి 7వ తరగతి వరకు 2,500 రూపాయలు, 8,9,10 తరగతి వరకు మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకాలను అందజేశారు. విద్యార్థులు మరింతగా చదువుల్లో రాణించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కన్నయ్య నాయుడు కాలనీ, గంగనపల్లె రోడ్డులోని హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ ఆరిపుల్లా షా చిష్టియుల్ ఖాదరి బాబా 53వ గంధ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు ప్రభుత్వ ఖాజీ సయ్యద్‌షా మొహమ్మద్ కమాలుల్ల జహూరి జునైది ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి హాజరై చాదర్ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయనను పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆను, సయ్యద్, మస్తాన్ ఖాన్, షకీల్, అక్రంఖాన్ పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే కేసులు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న లేబర్ ఆఫీసర్లు

- అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్‌రావు
- ఇటుకల బట్టీలు, కోళ్లఫారాల్లో తనిఖీ

గంగవరం: బాలలతో వెట్టిచాకిరీ పనులు చేయిస్తే కేసులు తప్పవని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్‌రావు హెచ్చరించారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి గంగవరం మండలంలో ఇటుకల బట్టీలు, కోళ్ల ఫారాలు మొదలైనచోట తనిఖీలు చేశారు. 18 ఏళ్ల లోపు వారిని ఎవరూ కూడా పనుల్లో పెట్టుకోరాదని ఫ్యాక్టరీలు, ఫారాల నిర్వాహకులను ఆదేశించారు. అలా ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే మాత్రం నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజులు పాటు 10 మండలాల్లో దీనిపై స్పెషల్ డ్రైవ్ చేస్తామని, ఎక్కడైనా బాలలతో పనులు చేయిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ మధుబాబు, రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాల దిగుబడి పెంపుపై అవగాహన



పుంగనూరు జాతి పొట్టిరకం దూడకు నట్టల నివారణకు మందును తాపిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

సోమల: పాల దిగుబడి పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై పాడి రైతులకు సోమల పశు వైద్యశాల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ఎస్.నడింపల్లె పంచాయతీ కరకమందలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 53 పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారీ చేశారు. 12 దూడలకు నట్టల నివారణకు మందును తాపించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధి గురించి, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి చందనప్రియ, స్థానిక సర్పంచ్ వెంకటరమణ, ఏహెచ్‌ఏ బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు లోపు మామిడి మొక్కలు నాటాలి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ సునీల్‌కుమార్

చౌడేపల్లె: ఉపాధి హామీ పథకంలో మామిడి తోటల పెంపకానికి గుంతలు తీసిన రైతులు ఈనెలాఖరులోపు మామిడి మొక్కలు నాటడం పూర్తి చేయాలని డ్వామా ఏపీడీ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వర్షపునీటిని భూమిలోకి ఇంకే విధంగా అవసరమైన పనులు చేయడంతోపాటు ఇళ్ల వద్ద మునగ చెట్లు పెంపకం పనులు చేపట్టాలన్నారు. పనులలో కూలీల సంఖ్యను పెంచడంతో పాటు హౌసింగ్ అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించాల్సిన రికార్డులు,ఫైలింగ్ ప్రక్రియను పరిశీలించి సూచనలిచ్చారు. సమావేశంలో ఏపీఓ శ్రీనివాసులు, జేఈ ధనుంజయుడు, సాంకేతిక సహాయకుడు అమరనాథ్, సయ్యద్‌బాషా సీఓలు ప్రసాద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9గంటల నిరంతర విద్యుత్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో అధికారులు

కుప్పం రూరల్: వ్యవసాయానికి 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వనున్నట్టు పుంగనూరు ఈఈ విజయన్ అన్నారు. కుప్పం మండలం చెక్కునత్తం సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిరంతరాయంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని కృతనిశ్చయంతో ఉందని, ఇందులో భాగంగానే 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల అప్‌గ్రేడ్ చేయాలో దశల వారీగా అక్కడ చేస్తామన్నారు. కార్యక్రమంలో రెస్కో ఎండీ సుబ్రమణ్యం, ఏడీఈ ప్రభాకర్, ఏ ఈ మునిరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కరాటే అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



సమావేశంలో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ శరణ్ కుమార్, సెక్రటరీ రెడ్డిమహేష్

పుంగనూరు: జిల్లా కరాటే అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి, లాగే అసోసియేషన్ చైర్మన్‌గా డాక్టర్ శరణ్‌కుమార్, టెక్నికల్ డైరెక్టర్‌గా హేమంత్, అధ్యక్షుడిగా సునీల్, కార్యదర్శిగా రెడ్డి మహేష్, ఉపాధ్యక్షుడిగా సాయితేజ, కోశాధికారిగా నిఖిల్, కార్యవర్గ సభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు మంగళవారం సభ్యులు తెలిపారు.

వాహనం సహా కర్ణాటక మద్యం సీజ్

- నిందితుడి అరెస్ట్

గంగవరం: వాహనంతో సహా అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. గంగవరం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం.. చిత్తూరుకు చెందిన లక్ష్మణ్ కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చి చిత్తూరు పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో కర్ణాటక నుంచి ఇన్నోవా కారులో రూ.1.5 లక్షల విలువ చేసే 24 మద్యం కేసులను తీసుకుని వస్తుండగా గంధ్రాజుపల్లె వద్ద వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. కారుతో సహా మద్యం కేసులను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో చిత్తూరు, పరిసర మండలాల్లో మద్యం అక్రమ రవాణాలో లక్ష్మణ్ పట్టుబడి పలు కేసులు నమోదైనట్టు ఎస్ఐ చెప్పారు.